

యువజన సంఘాల సభ్యులకు కండువాలు కప్పుతున్న ఎమ్మెల్యే గణేశ్‌గుప్తా

# ఐటీ హబ్ ద్వారా యువతకు ఉద్యోగాలు

## అర్బన్ ఎమ్మెల్యే గణేశ్‌గుప్తా ఆధ్వర్యంలో బీఆర్ఎస్‌లో చేరిన 400 మంది యువకులు

ఖలీల్‌వాడి, అక్టోబర్ 30 : నగరంలోని వివిధ పార్టీలు, యువజన సంఘాలకు చెందిన 400 మంది యువకులు బీఆర్ఎస్‌లో చేరారు. వారికి అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేశ్‌గుప్తా సోమవారం గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నగరంలో ఐటీ హబ్ నిర్మించడంతోపాటు మెగా జాబ్ మేళాలను ఏర్పాటు చేసి యువతకు ఉద్యోగావకాశాలు కల్పించామని గుర్తుచేశారు. ప్రతి కార్యకర్తకూ అండగా ఉంటానన్నారు. విశ్వశాంతి యూత్ క్లబ్, సూర్యోదయ యూత్, ఫులాంగ్ యూత్ తోపాటు గుమాస్తా సంఘం నుంచి బీఆర్ఎస్‌లో చేరారు. నగర మేయర్ దండు నీతూకిరణ్, నుడా మాజీ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, నాయకులు సుజిత్‌సింగ్ ఠాకూర్, సిర్ప రాజు, సూదం రవిచందర్, పల్లికొండ అన్నయ్య, మల్కాయి మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

# గిరిజనుల అభ్యున్నతికి బీఆర్ఎస్ ప్రభుత్వం కృషి

- తండాలను జీపీలుగా మార్చిన ఘనత సీఎం కేసీఆర్‌దే..
- నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్



గిరిజనులతో ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్, మాజీ ఎమ్మెల్సీ వీజీ గౌడ్

నిజామాబాద్ రూరల్, అక్టోబర్ 30 : గిరిజనుల అభ్యున్నతి కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం కృషి చేస్తున్నదని, తండాలను జీపీలుగా మార్చిన ఘనత సీఎం కేసీఆర్‌దేనని రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ అన్నారు. మండలంలోని మల్కాపూర్ తండాలో సోమవారం జగదాంబ మాత ఆలయంలో రామ్‌రావు మహరాజ్ వర్ధంతి నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యేతోపాటు మాజీ ఎమ్మెల్సీ వీజీ గౌడ్ హాజరై గిరిజనులతో కలిసి భోగ్‌భండార్ పూజలు నిర్వహించారు. అనంతరం బాజిరెడ్డి మాట్లాడుతూ.. గిరిజనుల ఆరాధ్యదైవం సేవాలాల్ మహరాజ్ జయంతిని బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తున్నదని తెలిపారు. గతంలో రాష్ర్టాన్ని పాలించిన పార్టీలు గిరిజనుల సంక్షేమాభివృద్ధిని పూర్తిగా విస్మరించాయని విమర్శించారు. తెలంగాణ రాష్ట్రం వచ్చాకనే తండాలన్నీ గ్రామపంచాయతీలుగా ఏర్పడి, ఆశించిన రీతిలో అభివృద్ధి జరిగిందని, దీంతో తండాల రూపురేఖలే పూర్తిగా మారిపోయాయని వివరించారు. తండాలను గిరిజనులే పాలించుకునే అవకాశం కల్పించిన సీఎం కేసీఆర్‌ను ఎన్నటికీ మరువొద్దని కోరారు. జగదాంబ, సేవాలాల్ మహరాజ్ ఆలయాల్లో ధూపదీప నైవేద్యం సమర్పించే అర్చకులకు రూ. 6వేల గౌరవ వేతనం చెల్లిస్తున్నట్లు చెప్పారు. వీజీ గౌడ్ మాట్లాడుతూ.. కేవలం ఎన్నికల సమయంలోనే ముఖం చూపించే కాంగ్రెస్, బీజేపీ నాయకుల కల్లబొల్లి మాటలు నమ్మొద్దన్నారు. అభివృద్ధి సాధకుడైన బాజిరెడ్డి గోవర్ధన్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని గిరిజనులను కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ హరిచంద్‌నాయక్, ఎంపీపీ అనూషా ప్రేమ్‌దాస్, జడ్పీటీసీ సుమలతా గోపాల్‌రెడ్డి, వైస్ ఎంపీపీ సాయిలు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మధుకర్‌రావు, ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు గోపాల్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.



ఆత్మీయ సమ్మేళనం పోస్టర్లను ఆవిష్కరిస్తున్న న్యాయవాదులు

# 4న న్యాయవాదుల ఆత్మీయ సమ్మేళనం

నిజామాబాద్ లీగల్, అక్టోబర్ 30: శాసనసభ ఎన్నికల నేపథ్యంలో నవంబర్ 4న హైదరాబాద్‌లో న్యాయవాదుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించనున్నట్లు బీఆర్ఎస్ లీగల్ సెల్ జిల్లా కన్వీనర్ దాదన్నగారి మధుసూదన్‌రావు, రాష్ట్ర నాయకుడు రాజలింగం, ఈగ గంగారెడ్డి, కిరణ్ కుమార్ గౌడ్, ఎన్ఎల్ శాస్త్రీ, కర్తన్ గణేశ్ తెలిపారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలోని న్యాయస్థానం ప్రధాన ద్వారం వద్ద సోమవారం వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆత్మీయ సమ్మేళనానికి రాష్ట్ర మంత్రి కేటీఆర్, రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్ కుమార్ హాజరవుతారని తెలిపారు. కరోనా కష్ట కాలంలో న్యాయవాదులకు రాష్ట్ర ప్రభుత్వం, సీఎం కేసీఆర్ అండగా నిలబడ్డరని గుర్తుచేశారు. న్యాయవాదులందరికీ బీమా కల్పించిన ఏకైక రాష్ట్రం తెలంగాణ అని, తమ సంక్షేమానికి కంకణబద్ధులైన కేసీఆర్ నాయకత్వానికి మద్దతు కూడగట్టాల్సిన ఆవశ్యకత ఉందన్నారు.



నాగరాజుకు నియామక పత్రాన్ని అందజేస్తున్న రిజిస్ట్రార్ యాదగిరి

## ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ సెల్ డైరెక్టర్‌గా పాత నాగరాజు

డిచ్‌పల్లి, అక్టోబర్ 30: టీయూలోని ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ సెల్ డైరెక్టర్‌గా అర్థశాస్త్ర విభాగానికి చెందిన సహ ఆచార్యులు డాక్టర్ పాత నాగరాజును నియమించారు. ఆయనకు వైస్‌చాన్స్‌లర్ వాకాటి కరుణ ఆదేశాల మేరకు రిజిస్ట్రార్ ఆచార్య ఎం.యాదగిరి సోమవారం నియామక ఉత్తర్వులను అందజేశారు. ఈ సందర్భంగా నాగరాజుకు పలువురు అధ్యాపకులు శుభాకాంక్షలు తెలిపారు.

## 360 డిగ్రీల కెమెరాతో నిఘా

డిచ్‌పల్లి, అక్టోబర్ 30: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో మూడు మండలాలకు ఒకటి చొప్పున ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలను ఏర్పాటు చేశారు. వీరి వాహనానికి 360 డిగ్రీల కోణంలో దృశ్యాలను కవర్ చేసేలా కెమెరాను ఏర్పాటు చేశారు. ఇక్కడ రికార్డు అయిన వివరాలు నేరుగా జిల్లా కలెక్టర్, ఆర్డీవో కార్యాలయానికి చేరుతాయి. 24 గంటలపాటు ఈ వాహనం సంచరిస్తూనే ఉంటుంది. దీంతోపాటు అదనంగా ఓ కెమెరామెన్‌ను కూడా అందుబాటులో ఉంచారు.



360 డిగ్రీల కెమెరాను ఏర్పాటు చేసిన వాహనం

## బీఆర్ఎస్ యూత్ వైస్ ప్రెసిడెంట్‌గా నరేశ్



నరేశ్‌కు నియమక పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే బాజిరెడ్డి

డిచ్‌పల్లి, అక్టోబర్ 30 : బీఆర్ఎస్ యూత్ మండల వైస్ ప్రెసిడెంట్‌గా ఘన్‌పూర్ గ్రామానికి చెందిన కురికెల్లి నరేశ్‌ను నియమించారు. ఆయనకు రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ సోమవారం నియామకపత్రాన్ని అందజేశారు. తన నియామకానికి సహకరించిన జడ్పీటీసీ బాజిరెడ్డి జగన్‌తోపాటు పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, జడ్పీటీసీ లక్ష్మీ నర్సయ్య, నాయకుడు శక్కరికొండ కృష్ణకు, యూత్ అధ్యక్షుడు అమీర్‌ఖాన్‌కు నరేశ్ ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు గడ్డం గంగాధర్, సొసైటీ డైరెక్టర్ సతీశ్‌రెడ్డి, ఉపసర్పంచ్ రంజిత్, సమీర్ పాల్గొన్నారు.

## ఉత్సాహంగా సీఎం ఆశీర్వాద సభకు..

చందూర్(మోస్రా)/రుద్రూర్, అక్టోబర్ 30 : బాన్సువాడ పట్టణంలో సోమవారం నిర్వహించిన సీఎం కేసీఆర్ ప్రజా ఆశీర్వాద బహిరంగ సభకు పలు మండలాల నుంచి ప్రజలతోపాటు బీఆర్ఎస్ శ్రేణులు ఉత్సాహంగా తరలివెళ్లారు. మోస్రా మండలం నుంచి జడ్పీటీసీ విజయ భాస్కర్‌రెడ్డి, ఎంపీపీ ఉమా శ్రీరాములు, పార్టీ మండల అధ్యక్షుడు హన్మంత్‌రెడ్డి ఆధ్వర్యంలో తరలివెళ్లారు. చందూర్ మండలం నుంచి ప్రత్యేక బస్సుల్లో భారీ సంఖ్యలో తరలివెళ్లారు. రుద్రూర్ మండలం నుంచి బీఆర్ఎస్ శ్రేణులతోపాటు ఆయా గ్రామాల నుంచి ప్రజలు పెద్ద సంఖ్యలో సభకు వెళ్లినట్లు పార్టీ మండల అధ్యక్షుడు పత్తి లక్ష్మణ్ తెలిపారు.




మోస్రా మండలం నుంచి నృత్యాలు చేస్తూ వెళ్తున్న గిరిజనులు



చందూర్ మండలం నుంచి బస్సుల్లో తరలుతున్న ప్రజలు, నాయకులు



రుద్రూర్ మండలం నుంచి..

## గంగపుత్రుల ఆత్మీయ సమ్మేళనానికి తరలిన నాయకులు

ఇందల్వాయి, అక్టోబర్ 30 : మండలకేంద్రంతోపాటు పలు గ్రామాల్లోని గంగపుత్ర సంఘ సభ్యులు డిచ్‌పల్లిలో సోమవారం నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనానికి తరలివెళ్లినట్లు డీసీసీబీ డైరెక్టర్ కోరట్‌పల్లి ఆనంద్ తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఉచితంగా చేప పిల్లలు అందించి గంగపుత్రుల ఆర్థికాభివృద్ధికి తోడ్పడుతున్నదని తెలిపారు. మిషన్ కాకతీయ ద్వారా చెరువులను పునరుద్ధరించిందన్నారు. తరలిన వారిలో సుధాకర్, పోచయ్య తదితరులు ఉన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న హెచ్ఎం

## జాతీయ స్థాయి క్రీడా పోటీలకు తరలిన విద్యార్థులు

డిచ్‌పల్లి, అక్టోబర్ 30 : మండలంలోని మిట్టాపల్లి పాఠశాలకు చెందిన క్రీడాకారులు కే కిశోర్, ఈ శ్రీకాంత్ పంజాబ్ రాష్ట్రంలోని లవ్లీ ప్రొఫెషనల్ యూనివర్సిటీలో నిర్వహించనున్న బేస్‌బాల్ ఎంఎల్‌బీ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొనేందుకు సోమవారం వెళ్లారు. ఈ సందర్భంగా వారిని హెచ్ఎం సుశీల్‌కుమార్, వ్యాయామ ఉపాధ్యాయుడు గంగామోహన్ అభినందించారు. జాతీయస్థాయిలో ప్రతిభ కనబర్చాలని ఆకాంక్షించారు. క్రీడాకారులకు ఆర్థికసాయం చేసిన సర్పంచ్ గణేశ్, మాజీ ఎంపీపీ కంచెట్టి గంగాధర్, ఎంపీటీసీ నర్సయ్య, కంచెట్టి మహేశ్, మాస్‌పెద్ది శ్రీనివాస్, రాజన్న, రవి, గోపు రాజేశ్వర్, డాక్టర్ కుమార్, ఉపాధ్యాయుడు రాఘవేందర్‌ను అభినందించారు.